క్లుప్తంగా

అభివృద్ధి పనుల పరిశీలన



ఈస్ట్ పార్క్‌లో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మద్దిలపాలెం: జీవీఎంసీ 51వ వార్డు ఈస్ట్ పార్క్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం కార్పొరేటర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు రెయ్యి వెంకటరమణ పరిశీలించారు. ఈ పార్క్‌లో సరైన వెలుతురు లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఆధునిక లైటింగ్ వ్యవస్థను, బ్యాడ్మింటన్ కోర్టుకు ఫ్లడ్‌లైట్లను కార్పొరేటర్ మంజూరు చేయించారు. ఈ పనులను ఇటీవల ప్రారంభించారు. వాటిని వార్డు వర్క్స్ ఇన్‌స్పెక్టర్ సంతోష్, కాంట్రాక్టర్‌తో కలిసి కార్పొరేటర్ పర్యవేక్షించారు.

దసరా ఉత్సవాలకు పందిరి రాట



వరాహగిరి కాలనీ-2లో ఉత్సవ రాట వేస్తున్న మహిళలు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు వరాహగిరి కాలనీ-2లో కనకదుర్గ పంచాక్షరి అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న దసరా మహోత్సవాలకు బుధవారం వేద మంత్రాల నడుమ పందిరి రాట వేశారు. ఈ నెల 22 నుంచి అక్టోబరు 2 వరకు నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో లలిత, గౌరి, రేఖ, తులసి, లీలా, సత్య, రమ, మీనా, వసుంధర, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

సీతంపేటలో మహా అన్నసమారాధన



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న అతిథులు

సీతంపేట: వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా సీతంపేట కూడలిలోని దుర్గాగణపతి ఆలయం వద్ద బుధవారం మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులు స్టీల్ సిటీ సెక్యూరిటీస్ డైరెక్టర్లు కె.సత్యనారాయణ, సతీష్‌కుమార్ ఆర్య, పి.మధు, టి.వి.శ్రీకాంత్ భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. వేల సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా దుర్గాగణపతికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ప్రియదర్శిని వృద్ధాశ్రమంలో అన్నదానం



ఆశ్రమంలో వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న కె.కె.రాజు, శశికళ

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 55వ వార్డు కార్పొరేటర్ కె.వి.ఎన్.శశికళ జన్మదిన వేడుకలు బుధవారం జగన్నాథపురంలోని ప్రియదర్శిని వృద్ధుల ఆశ్రమంలో ఘనంగా నిర్వహించారు. వృద్ధుల సమక్షంలో ఆమె కేక్ కట్‌చేశారు. అనంతరం శశికళ ఆశ్రమంలో రాత్రి భోజనం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు చేతుల మీదుగా వృద్ధులకు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి, శ్రీదేవీవర్మ, వరలక్ష్మి, బొడ్డేటి గంగామహేష్, యర్రంశెట్టి శ్రీనివాస్, జక్కంపూడి సత్యనారాయణ, ఎం.సునీల్‌వర్మ, పద్మశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని పాత డెయిరీ ఫామ్‌కి చెందిన జి.అన్నపూర్ణ అనే దాత రూ.లక్ష 116 విరాళాన్ని అందించారు. సంబంధిత విరాళాన్ని చెక్కు రూపంలో ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావుకి సింహగిరిపై బుధవారం ఇచ్చారు. దేవస్థానం తరఫున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం, ఆశీర్వచనంని అధికారులు అందజేశారు.



నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో పాపా హోం ఎదురుగా రోడ్డు మీద పేరుకుపోయిన చెత్త

చెత్తశుద్ధి ఏదీ..?

- 14వ వార్డులో అధ్వానంగా పారిశుధ్యం
- పేరుకుపోతున్న వ్యర్థాలతో ఇబ్బందులు
- చాలీచాలని డస్ట్ బిన్లు
- విధుల్లో నిర్లక్ష్యంగా పారిశుధ్య సిబ్బంది



పోర్టు స్టేడియం వద్ద సర్వీస్ రోడ్డులో శిథిలమైన డస్ట్ బిన్

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 14వ వార్డులో పారిశుధ్యం అధ్వానంగా మారింది. వార్డులోని పలు ప్రాంతాల్లో చెత్త పేరుకుపోతోంది. ఇక్కడ చెత్త వేసేందుకు ఏర్పాటు చేసిన డంపర్, డస్ట్ బిన్లు తుప్పు పట్టి శిథిలావస్థకు చేరాయి. వాటికి పెద్ద పెద్ద రంధ్రాలు ఏర్పడటంతో లోపల వేసిన చెత్త సరాసరి కిందికి వచ్చేస్తుంది. మరికొన్ని చోట్ల డస్ట్ బిన్లలోని చెత్తను కుక్కలు, పశువులు బయటకు లాగి తింటూ పరిసరాలను అపరిశుభ్రంగా చేస్తున్నాయి. వార్డులో తగినన్ని డస్ట్ బిన్లు లేకపోవడంతో కొందరు రోడ్ల పక్కనే వ్యర్థాలను పడేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో సేకరించిన చెత్తను డస్ట్ బిన్లలో వేసేందుకు అవి చాలడం లేదు. చెత్త తరలించే వాహనాలు ఎలాగూ వస్తాయి కదా అని జీవీఎంసీ సిబ్బంది, స్థానికులు కూడా రోడ్డు మీదే చెత్తను డంప్‌చేస్తున్నారు. జీవీఎంసీ వాహనాలు వచ్చే సరికి ఈ చెత్త రోడ్డంతా వ్యాపిస్తోంది. పరిసరాలను ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సెలవిచ్చే జీవీఎంసీ అధికారులు, సిబ్బంది.. పారిశుధ్య నిర్వహణలో చిత్తశుద్ధి లేకపోవడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఈ ప్రాంతాల్లో ఇదీ పరిస్థితి..

- సీతమ్మధార డాక్టర్స్ కాలనీ, ఆర్ అండ్ బీ పార్క్ ఎదురుగా పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు, చెత్తాచెదారం కొద్ది రోజులుగా పడి ఉన్నాయి. వీటిని ఇప్పటివరకు తొలగించలేదు. ఇవి ఇక్కడే ఎండకు ఎండి, వానకు తడిస్తూ అధ్వానంగా దర్శనమిస్తున్నాయి.
- సీతమ్మధార క్షత్రియ కల్యాణ మండపం పక్కన ఏర్పాటు చేసిన రెండు డస్ట్ బిన్లలో ఒకటి చక్రం లేకుండా పక్కకు ఒరిగిపోయి ఉంది. ఈ బిన్‌లో చెత్త వేసేందుకు అవకాశం లేక నిరుపయోగంగా మిగిలింది.
- నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని బాలికల పాపా హోం ఎదురుగా ఉంచిన డస్ట్ బిన్ పరిస్థితి దారుణంగా తయారైంది. ఇక్కడ బిన్ చుట్టూ వ్యర్థాలు పేరుకుపోవడంతో దాని వద్దకు వెళ్లి చెత్త వేయలేని పరిస్థితి నెలకొంది. ఈ ప్రాంతంలో మరో డంపర్ బిన్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.
- అక్కయ్యపాలెం హైవేలోని పోర్టు స్టేడియం పక్కన గల సర్వీస్ రోడ్డులో ఏర్పాటు చేసిన డస్ట్ బిన్లు పూర్తిగా పాడైయ్యాయి. వీటిలోనే కొందరు స్థానికులు చెత్త వేస్తున్నారు. ఈ బిన్లు శిథిలమైనా మార్చడం లేదు. వీటిలో వేసే చెత్త రోడ్డు మీదకు చేరి దుర్వాసన, దోమలను వ్యాపిస్తున్నాయి. చెత్త పేరుకుపోవడం వల్ల ఇబ్బందులు పడటంతోపాటు దోమలు విజృభించి వ్యాధులు ప్రబలే అవకాశముందని 14వ వార్డు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై పారిశుధ్య అధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



సీతమ్మధార ఆర్ అండ్ బీ క్వార్టర్స్ ఎదురుగా కొద్ది రోజులుగా పడి ఉన్న చెట్ల కొమ్మలు



క్షత్రియ కల్యాణ మండపం పక్కన ఒరిగిపోయిన చక్రం లేని డస్ట్ బిన్

వేతనాలు చెల్లించేలా చూడండి



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజుకు వినతిపత్రం సమర్పిస్తున్న సినర్జీస్ ఉద్యోగుల సంఘం నాయకులు

తాటిచెట్లపాలెం: దువ్వాడలోని సినర్జీస్ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ వంటివి చెల్లించడం లేదని ఆ కంపెనీ ఉద్యోగుల సంఘం నాయకులు వాపోయారు. ఈ మేరకు వారు బుధవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజును కలిసి వినతిపత్రం సమర్పించారు. తమ సమస్యలను యాజమాన్యం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని ఉద్యోగ సంఘం నాయకులు తెలిపారు. సమస్యను పరిష్కరించే విధంగా మేనేజ్‌మెంట్‌తో మాట్లాడతానని, ఉద్యోగులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని కేకే రాజు తెలిపారు. కార్యక్రమంలో సినర్జీస్‌కంపెనీ ఉద్యోగుల సంఘం ప్రెసిడెంట్ ఎం శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ దేవదాస్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

తాటిచెట్లపాలెం: ఫోర్త్ టౌన్ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్న వ్యక్తులను పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. రైల్వే క్వార్టర్స్‌లో బుధవారం సాయంత్రం ఆరుగురు వ్యక్తులు పేకాడుతున్నారు. ఇది గమనించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని, రూ.11 వేలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఉమాకాంత్ తెలిపారు.

నన్నయ భారతంపై సాహిత్య ప్రసంగం



ప్రసంగిస్తున్న రచయిత చిన సూర్యనారాయణ

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో జరిగిన సాహిత్య కార్యక్రమంలో రచయిత సిహెచ్. చిన సూర్యనారాయణ నన్నయ్య భారతం గురించి ప్రసంగించారు. నన్నయ్య భారత రచనా కవితా రీతులు, ప్రసన్న కథాకలితార్థ యుక్తి, అక్షర రమ్యత, నానా రుచిరార్థ సూక్తి నిధి గురించి సోదాహరణ పూర్వకంగా వివరించారు. నన్నయ్య రచించిన ఆది పర్వం, సభా పర్వం, అరణ్య పర్వంలోని చతుర్థి అశ్వాసము 142వ పద్యం 'శారద రాత్రులుజ్వల' వరకు రచన చేశారని వివరిస్తూ అందులోని పద్యాలను రాగం, భావయుక్తంగా పాడి వివరణ ఇచ్చారు. డాక్టర్ కె.వి.ఎస్.మూర్తి అధ్యక్షతన నిర్వహించిన సభలో డాక్టర్ డి.వి.సూర్యారావు ప్రసంగాన్ని విశ్లేషించారు. కార్యక్రమంలో రచయితలు భాగవతుల సత్యనారాయణమూర్తి, ఎం.పరమేశ్వరరావు, సిహెచ్.రవిమోహన్, జి.సూర్యనారాయణ, సఫమంచి వినయ్‌భూషణ్, పి.వెంకట రామకుమారరావు, కె.విశ్వేశ్వరరావు, జి.శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

వడ్డాది పాపయ్య చిత్రాలు అద్భుతం

సీతంపేట: దేశం గర్వించదగిన చిత్రకారుడు వడ్డాది పాపయ్యని పలువురు వక్తలు కొనియాడారు. వడ్డాది పాపయ్య జయంతి సందర్భంగా సౌభాగ్య గజపతి ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డాది పాపయ్య తనయుడు పవన్‌రామ్ మాట్లాడుతూ తన తండ్రి కళాజీవితం ఎంత గొప్పదో, వ్యక్తిగత జీవితం అంతకంటే గొప్పదని తెలిపారు. అతి సామాన్యమైన రంగుల్లోంచి అత్యద్భుతమైన చిత్రాలను మలిచి నేటికీ ప్రజల మదిలో నిలిచిపోయారన్నారు. ట్రస్టు ఆధ్వర్యంలో వాపా గజపతి అవార్డును సుంకర చలపతిరావుకు, పతి నాగేశ్వరరావు అవార్డును కడలి రాజేంద్రప్రసాద్‌కు అందజేశారు. కార్యక్రమంలో ముందుగా వడ్డాది పాపయ్య చిత్రపటానికి సీనియర్ ఆర్టిస్ట్ పెమ్మరాజు రవికిషోర్, ప్రభాకర్ శర్మ తదితరులు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.



వడ్డాది పాపయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రముఖులు


ఏయూలో ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ టోర్నీ

మద్దిలపాలెం: ఆంధ్రా యూనివర్సిటీ వేదికగా త్వరలో సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పురుషుల క్రికెట్ టోర్నమెంట్ జరగనుందని ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య ఎస్.విజయమోహన్ వెల్లడించారు. ఏయూ వ్యాయామ విద్యా విభాగంలో ఆయన అధ్యక్షతన బుధవారం ఏయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పోర్ట్స్ సైన్సెస్ 2025–26 సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయమోహన్ మాట్లాడుతూ ఈ నెల 15న ఆర్చరీ పురుషులు, మహిళల విభాగంలో యూనివర్సిటీ జట్టు ఎంపిక ఉంటుందన్నారు. ఈ నెల 25న యోగా పురుషులు, మహిళల జట్టు ఎంపిక జరుగుతుందని తెలిపారు. ఈ ఏడాది ఇంటర్ కాలేజీ క్రీడలు మహిళలు, పురుషుల విభాగంలో జరుగుతాయని చెప్పారు. కబడ్డీ, హాకీ, ఫుట్‌బాల్, క్రికెట్, హ్యాండ్‌బాల్, కోకో, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, కిక్ బాక్సింగ్ తదితర క్రీడల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఐదు జిల్లాలకు చెందిన ఏయూ అనుబంధ కళాశాలల క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. ఇంటర్ కాలేజ్ క్రీడల్లో ఎంపికైన క్రీడాకారులకు సౌత్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. ఏయూ వ్యాయామ విభాగాధిపతి ఆచార్య పల్లవి మాట్లాడుతూ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా వివిధ క్రీడా పోటీలను నిర్వహించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎం.ఆర్.కళాశాల లెక్చరర్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ వాసుదేవరాజు, డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ ఎల్.బి.కళాశాల వ్యాయామ విద్యా విభాగం హెడ్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ లక్ష్మణరెడ్డి, డాక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



గణపతి విందు.. భలే పసందు

- 45 రకాల పదార్థాలతో అన్నసమారాధన
- కొబ్బరితోట వాసులకు విందుభోజనం
- బహుమతిగా వెండి వినాయక చిత్రాల బహూకరణ



వెండి వినాయకుడి చిత్రం



భోజనాలు చేస్తున్న భక్తులు

అల్లిపురం: వినాయక భోజనంబు.. భలే పసందు అంటూ కొబ్బరితోట వాసులు లొట్టలేసుకుంటూ ఆరగించారు. కొబ్బరితోట ఎస్‌వీపీ నగర్‌లో క్రేజీ బాయ్స్ ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా బుధవారం సుమారు 2500 మందికి అన్నసమారాధన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సుమారు 40కి పైగా పదార్థాలతో విందు ఏర్పాటు చేశారు. వాటితో పాటు ఒక వెండి వినాయక ఫొటో కూడా బహుమతిగా అందజేశారు. ఒక్కొక్కరికి వెల్‌కమ్ డ్రింక్, ఒక లస్సీ, 2 లీటర్ల డ్రింకు బాటిల్, సోడా బాటిల్, వాటర్ బాటిల్, మిల్క్ మరీదా, ఫలూడా, 10 రకాల స్వీట్లు, మూడు ఫ్రై కర్రీలు, 4 గుజ్జు కర్రీలు, బిర్యానీ, పులిహోర, వైట్ రైస్, సాంబారు, పెరుగుచారు, కుల్ఫీ, కోన్ ఐస్ క్రీమ్, హల్వా, జున్ను, సత్యనారాయణ ప్రసాదంతో కలిపి విందు భోజనంలా వడ్డించారు. తిన్నవారంతా ఆహా ఏమి విందు అంటూ సంతృప్తి వ్యక్తం చేశారు.

ఇంటింటికీ కూటమి మోసాలు



42వ వార్డులో నివాసులకు కరపత్రం అందిస్తున్న భీశెట్టి ప్రసాద్, పార్టీ నాయకులు

తాటిచెట్లపాలెం: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు సూచనలతో పార్టీ 42వ వార్డు అధ్యక్షుడు భీశెట్టి ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం వార్డులోని 57వ నంబర్ పోలింగ్ బూత్ పరిధి రామాలయం వీధిలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం ఏ విధంగా మాటతప్పిందో, హామీలు అమలు చేయలేదో ప్రజలకు వివరించారు. కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రజలను మోసం చేస్తోందని భీశెట్టి ప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో పార్టీ వార్డు నాయకులు కేవీ ఆర్ మూర్తి, రియాజ్, వెంకటేష్, రిజ్వాన్ ఖాన్, అక్బర్, లోకేష్, అబ్రహం, కోకిల, స్వర్ణ కుమారి, కనక మహాలక్ష్మి, నాగమణి, జయ, గీత తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యలు నివారించదగినవే..



మాట్లాడుతున్న డాక్టర్ ఎస్.ఎన్.రాజు

సీతంపేట: ఇటీవల పెరుగుతున్న ఆత్మహత్యలు దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయని భారతీయ మానసిక వైద్య సంఘం పూర్వ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఎన్.రాజు అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం సందర్భంగా బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో కౌసల్య కౌన్సిలింగ్ సెంటర్ నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించరు. లక్ష మందిలో 12 నుంచి 15 మంది ప్రతి ఏటా బలవన్మరణాలకు పాల్పడుతున్నారని, ఇవి చాలా వరకు నివారించ దగినవే అన్నారు. ప్రజల్లో అవగాహన పెరిగి సత్వర నివారణ చర్యలు చేపడితే చాలా మంది ప్రాణాలను కాపాడవచ్చన్నారు. పరీక్షల్లో ఫెయిల్ కావడం, ప్రేమలో వైఫల్యాలు, భార్యాభర్తల గొడవలు, వివాహేతర సంబంధాలు, ఆర్థిక లావాదేవీలు, మత్తు పదార్థాలు సేవించడం, మానసిక అనారోగ్యం ఆత్మహత్యలకు కారణమవుతున్నాయని వివరించారు. పిరికి మనసులు, కష్టనష్టాలు ఉన్నవారు మాత్రమే బలవన్మరణాలకు పాల్పడతారని, వాటిని నివారించే శక్తి వేరే వారికి లేదనేది పూర్తిగా అవాస్తవమన్నారు. ఆత్మహత్య ప్రయత్నం చేసే వారు మానసిక దౌర్బల్యం ఉన్నవారనేది అపోహ మాత్రమేనని, శారీరక రోగాల మాదిరిగా మానసిక ఆందోళన, దిగులు వంటి పరిస్థితులను కౌన్సెలింగ్ మందుల ద్వారా నయం చేసు కోవచ్చని చెప్పారు. డాక్టర్ నిహాల్ మాట్లాడుతూ ఆత్మహత్యలను నివారించే దిశగా ప్రజలను అప్రమత్తం చేయడమే బాధ్యతగా ఇటువంటి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

క్రీస్తు ప్రేమను సమాజానికి అందిద్దాం



మాట్లాడుతున్న డాక్టర్ కె.వి.ఎస్.పాల్

సీతంపేట: విశాఖలోని సెయింట్ పాల్స్ థియోలాజికల్ కాలేజ్ 22వ స్నాతకోత్సవం బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. క్రైస్తవ వేదాంత విద్యలో తర్ఫీదు పొందిన వారికి డిగ్రీలు ప్రదానం చేవారు. ఈ సందర్భంగా కళాశాల ఫౌండర్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.ఎస్.పాల్ మాట్లాడుతూ 23 ఏళ్లుగా నిబద్ధతతో క్రైస్తవ వేదాంత విద్యలో కరస్పాండెన్స్ విధానంలో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. బైబిల్ బోధనను, క్రీస్తు ప్రేమను సమాజానికి అందించాలనుకునే సేవకులకు క్రిస్టియన్ థియాలజీ విద్య కీలక పాత్ర పోషిస్తుందన్నారు. తమ కళాశాల ద్వారా ఎంతో మంది క్రైస్తవ వేదాంత విద్యను అభ్యసించి క్రీస్తు ప్రేమను ప్రకటిస్తూ సేవలో ముందుకు సాగుతున్నారన్నారు. ఏయూ రిటైర్డ్ ప్రొఫెసర్ బి.రత్నప్రభాకర్ చేతుల మీదుగా క్రిస్టియన్ థియాలజీలో కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాలు, పరిశోధకులకు గౌరవ డాక్టరేట్లు, పాస్టర్లకు ఆర్డినేషన్ అందజేశారు. కార్యక్రమంలో పలువురు బిషప్‌లు, పాస్టర్లు, క్రైస్తవ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

'హోల్డ్ ఆన్' పుస్తకావిష్కరణ



రచయిత పూజితను సత్కరించి జ్ఞాపిక అందిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో బుధవారం ఆత్మహత్యల నివారణకు సంబంధించిన పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ పూజిత జోస్యుల 'హోల్డ్ ఆన్' అనే శీర్షికతో రచించిన సూసైడ్ ప్రివెన్షన్ అవుట్ రీచ్ – లైఫ్ సేవర్ అనే పుస్తకాన్ని ముఖ్య అతిథి నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో ఆత్మహత్యలు నివారించడానికి మానసిక శాస్త్రంపై అవగాహన ఉండాలన్నారు. అనంతరం పుస్తక రచయిత పూజితను సత్కరించి జ్ఞాపిక అందజేశారు. పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టయోట్స్ రేర్ ఎర్త్స్ ఇండియా లిమిటెడ్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ బి.మురళీధరరావు, కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏయూ స్నాతకోత్సవ నిర్వహణపై వీసీ సమీక్ష



మాట్లాడుతున్న ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయ స్నాతకోత్సవాన్ని సమష్టిగా నిర్వహించాలని ఏయూ వైస్ చాన్సలర్ ఆచార్య జి.పి. రాజశేఖర్ సూచించారు. స్నాతకోత్సవ నిర్వహణపై వివిధ కమిటీల సభ్యులు, అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిసెప్షన్ కమిటీ, ఆర్గనైజింగ్ కమిటీ, సైటేషన్ కమిటీలు తమకు కేటాయించిన బాధ్యతలను సకాలంలో పూర్తి చేసే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకుని ముందుకు వెళ్లాలని తెలిపారు. స్నాతకోత్సవ మందిరానికి అవసరమైన మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ విభాగానికి ఆదేశించారు. ఈ సంవత్సరం స్నాతకోత్సవం నిర్వహించే ప్రక్రియలో ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలని చెప్పారు. స్నాతకోత్సవంలో డిగ్రీలు తీసుకునే వారి సంఖ్య, అవార్డులు, మెడల్స్ వంటివి సిద్ధం చేయాలని పరీక్షల విభాగానికి ఆదేశించారు. స్నాతకోత్సవంలో విద్యార్థులతో పాటు వారి కుటుంబ సభ్యులు సైతం హాజరవుతారని, దానిని దృష్టిలో పెట్టుకుని సిటింగ్ ఏర్పాట్లు పటిష్టంగా అమలు చేయాలన్నారు. స్నాతకోత్సవ మందిరంలోకి ప్రవేశం, బయటికి వెళ్లే మార్గాలు వేర్వేరుగా ఉండాలని సూచించారు. పనులను త్వరతగతిన పూర్తి చేస్తూ ప్రగతిని ఎప్పటికప్పుడు కమిటీ చైర్మన్‌కు తెలియజేయాలని సభ్యులకు సూచించారు. ఈ సమావేశంలో రెక్టార్ ఆచార్య ఎ.సి. కిషోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య కె. రాంబాబు, ప్రిన్సిపాళ్లు, టీసీలు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'అక్షయపాత్ర'కు వంట సామగ్రి వితరణ



వంట సామగ్రిని అందజేస్తున్న ఫార్మాజెల్ కంపెనీ ప్రతినిధులు

కంచరపాలెం: కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని టచ్ స్టోన్ చారిటీస్ సంస్థ(అక్షయపాత్ర) వంటశాలకు బుధవారం ఫార్మాజెల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వంట సామగ్రిని వితరణ చేసింది. కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ అనంత్ దత్తాత్రేయ బార్పదికర్ చేతుల మీదుగా రూ.3 లక్షల విలువైన వంట సామగ్రిని సంస్థ ప్రెసిడెంట్ డాక్టర్ నిష్కించిన భక్త దాస్‌కు, ప్రతినిధులకు అందజేశారు. కార్యక్రమంలో హ్యూమన్ రిసోర్స్ మేనేజర్ అప్పారావు, యదురాజా దాస్ తదితరులు పాల్గొన్నారు.